

లారీని ఢీకొట్టిన కారు

ఆగిఉన్న లారీని కారు ఢీకొన్న ప్రమాదంలో ఎస్‌ఐ, కానిస్టేబుల్ మృతిచెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. - 8లో



నిరంతర సాధనతోనే..

విద్యార్థులకు నిరంతర సాధన ద్వారానే విజయాలు సాధ్యమని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. - 8లో



గంజాయి విక్రయదారుల అరెస్ట్

చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న భార్యాభర్తలు, గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

సగటు వర్షపాతం.. 8.3 మిల్లీమీటర్లు

నల్లగొండ అగ్రికల్చర్ : జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు 8.3 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా చందంపేట మండలంలో 37.1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. గుండ్లపల్లిలో 31.0, నేరెడుగొమ్ములో 29.5, పెద్దవూరలో 16.1, పీఏపల్లిలో 15.4, తిప్పర్తిలో 15.9, కేతేపల్లిలో 15.9, నకిరేకల్‌లో 14.3, దామరచర్లలో 13.6, మిర్యాలగూడలో10.4, శాలిగౌరారంలో 11.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కట్టంగూరులో 7.3, నల్లగొండలో 3.7, కనగల్‌లో 3.6, మునుగోడులో 1.1, చండూరులో 3.9, చింతపల్లిలో 1.5, నాంపల్లిలో 0.2, గుర్రంపోడు 3.0, అనుముల హాలియా 3.1, నిడమనూరులో 2.2, త్రిపురారంలో 3.4, మాడుగులపల్లిలో 4.7, వేములపల్లిలో 4.0, అడవిదేవులపల్లిలో 4.1, తిరుమలగిరి సాగర్‌లో 2.9, కొండమల్లెపల్లిలో 1.9, దేవరకొండలో 8.0 గుడిపల్లిలో 2.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దేవరకొండ డివిజన్‌లో అధిక వర్షం కురిసింది.

ప్రతి పేషెంట్‌కు 'ఆభా' ఐడీ క్రియేట్ చేయాలి



రోగులతో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్

దేవరకొండ : ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే ప్రతి పేషెంట్‌కు తప్పనిసరిగా ఆయుస్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (ఆభా) ఐడీ క్రియేట్ చేయాలని డీసీహెచ్‌ఎస్ మాతృనాయక్ అన్నారు. గురువారం దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఆరోగ్యశ్రీ సిబ్బందితో వేర్వేరుగా సమావేశం నిర్వహించి వారికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యసేవల కోసం ఆస్పత్రికి వచ్చేవారి పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఆరోగ్యశ్రీ సేవల్లో దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రి ముందుందన్నారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటిండెంట్ రవిప్రకాష్, సిబ్బంది ఉన్నారు.

రాజీవ్ యువ వికాసాన్ని ప్రారంభించాలి



మాట్లాడుతున్న కోట రమేష్

నల్లగొండ టౌన్: ప్రభుత్వం రాజీవ్ యువ వికాస్ పథకాన్ని వెంటనే ప్రారంభించి అర్హులకు ఇవ్వాలని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ అన్నారు. గురువారం నల్లగొండలో ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగులు ఉద్యోగాలు లేక ఉపాధి కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. సమావేశంలో రవినాయక్, మల్లం మహేష్, పతని శ్రీను, కట్ట లింగస్వామి, వడ్డగాని మహేష్, మహ్మద్ ఆక్రమ్, పాలడి కార్తీక్, వంశీ, ఏడుకొండలు, బొడ్డుపల్లి నరేష్, బూర్గు గోపి కృష్ణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చినుకు లేక.. మొలకెత్తక..



ఈయన పెద్దవూర మండలం గర్నెకుంటకు చెందిన చిట్టిమళ్ల సత్యం. ఈయన ఐదెకరాలు కౌలుకు తీసుకొని పత్తి వేశారు. అప్పటినుంచి సరైన వర్షం పడకపోవడంతో చాలా విత్తనాలు మొలకెత్తలేదు. మొలకెత్తినవి కూడా ఎండలకు ఎండిపోతున్నాయి. ఎకరాకు మూడు ప్యాకెట్ల చొప్పున ఐదెకరాలకు 15 ప్యాకెట్ల పత్తి గింజలు వేశాడు. వాటితోపాటు అరక, కూలీలు మొత్తంగా రూ.22 వేలు వెచ్చించాడు. వర్షాల్లేక ఇప్పుడు నష్టపోయే పరిస్థితి వచ్చిందని సదరు రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. జిల్లా అంతటా ఇదే పరిస్థితి నెలకొంది.



శాలిగౌరారం మండలం ఆకారంలో మొలకెత్తని పత్తి విత్తనాలు చూస్తున్న రైతు జినుక సైదులు



పెద్దవూర మండలం గర్నెకుంటలో వాడుబట్టిన పత్తి మొక్క

- పత్తి విత్తనాలు వేసిన రైతుల్లో ఆందోళన
- చాలాచోట్ల మొలకెత్తని విత్తనాలు
- మొలకెత్తిన చోట వాడుబడుతున్నయ్
- కాపాడుకునేందుకు కర్షకుల పాట్లు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: తొలకరి వర్షంతో వివిధ రకాల విత్తనాలు వేసిన రైతుల ఆశలు ఆడియాశలయ్యాయి. వర్షాకాలం ప్రారంభమై 25 రోజులు గడుస్తున్నా వరుణుడు కరుణించక రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని వివిధ మండలాల్లో పత్తి, మక్క తదితర మెట్టపంటల విత్తనాలు నాటినా వర్షాల్లేక మొలకత్తలేదు. అక్కడక్కడా మొలెత్తినవి ఎండిపోతున్నాయి. దీంతో రైతులు వాటిని కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. బిందెలతో నీళ్లు పోస్తున్నా ప్రయోజనం లేని పరిస్థితి నెలకొంది. మొదట్లో కాస్త ఊరించిన వరుణుడు ఆ తర్వాత ముఖం చాటేయడంతో రైతన్నలు వర్షాల కోసం ఆకాశంవైపు చూస్తున్నారు.

తీవ్ర వర్షాభావ పరిస్థితులు

వివిధ మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలోని శాలిగౌరారం, కనగల్, పెద్దవూర తదితర మండలాల్లో సుమారు 70 నుంచి 100 శాతం వరకు వర్షపాతం లోటు నెలకొంది. మిగతా మండలాల్లోనూ ఆశించిన స్థాయిలో వర్షాలు పడటం లేదు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట, అడ్డగూడూరు, భువనగిరి తదితర మండలాల్లోనూ వర్షాభావ పరిస్థితుల నెలకొన్నాయి.

మళ్లీ అప్పులు చేయాల్సిన పరిస్థితి



నాకు ఎకరంన్నర పొలం ఉంది. గ్రామంలోని మరో రైతుకు చెందిన 11 ఎకరాలు కౌలుకు తీసుకున్నా. ఈనెల మొదట్లో వర్షాలు పడడంతో పత్తి విత్తనాలు నాటాను. ముందు మురిపించిన వాన తరువాత మొఖం చాటేసింది. దీంతో ఆ విత్తనాలు మొలకెత్తలేదు. ఇందుకోసం ఇప్పటికే రూ.2.30 లక్షలు అప్పు చేశాను. ఇప్పుడు మళ్లీ విత్తనాల పెట్టాలంటే మరో రూ.50 వెచ్చించాల్సిన పరిస్థితి వచ్చింది.

– జినుక సైదులు, ఆకారం, శాలిగౌరారం

పత్తి విత్తనాలు సగమే మొలకెత్తాయి



ఆరెకరాల్లో పత్తి విత్తనాలు పెట్టాం. అందులో సగమే మొలకెత్తాయి. మిగతా సగం భూమిలో తేమలేక మొలవలేదు. 15 రోజుల నుంచి వర్షం లేదు. దున్నడం నుంచి విత్తనాలు విత్తే వరకు ఎకరాకు రూ.15 వేల వరకు పెట్టుబడి పెట్టాం. మొలవని చోట్ల మళ్లీ విత్తనాలు పెట్టాల్సి వస్తుంది. ఈ ఏడాది పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

– ఐతగోని జంగమ్మ, రాంరెడ్డిపల్లి, మర్రిగూడ

మొదట్లో ఊరించిన వానలు

ఈ నెల మొదట్లో నైరుతి రుతు పవనాల ప్రభావంతో జిల్లాలోని పలు మండలాలలో కొద్దిపాటి జల్లులు పడడంతో రైతులు ఆనందంతో పత్తి విత్తనాలు విత్తారు. ఆ తరువాత నుంచి మళ్లీ వర్షాలు పెద్దగా పడకపోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఇంకా కొద్ది రోజులు ఇలాగే ఉంటే పెట్టిన పెట్టుబడి మొత్తం పోవడంతోపాటు మళ్లీ అదనంగా విత్తనాలకు పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాదకద్రవ్యాల నిర్మూలన ర్యాలీలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, అధికారులు, విద్యార్థులు

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- నల్లగొండలో అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీ

నల్లగొండ : యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలో పోలీస్, సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఎన్‌జీ కళాశాల నుంచి క్లాక్ టవర్ వరకు చేపట్టిన అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్లగొండలోని ప్రకాశం బజార్‌లో డిజిటల్ తరగతుల తోపాటు, అన్ని సౌకర్యాలతో నూతన పాఠశాల నిర్మిస్తున్నామని తెలిపారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ డ్రగ్స్ విక్రయాల గురించి తెలిసివారు డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, అదనపు ఎస్పీ రమేష్, డీఈఓ భిక్షపతి, డీఎస్పీ శివరాంరెడ్డి, సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



డ్రగ్స్‌కు వ్యతిరేకంగా గీసిన పెయింటింగ్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థి



ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి, ఎమ్మెల్సీ, ఎస్పీ, అదనపు కలెక్టర్ తదితరులు

భూసేకరణ ప్రక్రియ పూర్తిచేయాలి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నార్కట్‌పల్లి : ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకంలోని బ్రాహ్మణ వెల్లంల రిజర్వాయర్‌కు సంబంధించి మిగిలిపోయిన భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన బ్రాహ్మణ వెల్లంల రిజర్వాయర్‌ను సందర్శించి మాట్లాడారు. కాల్వ పనులను వేగవంతంగా పూర్తి చేస్తే రిజర్వాయర్ కింది లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. పానగల్ ఉదయ సముద్రం నుంచి బ్రాహ్మణ వెల్లంల రిజర్వాయర్‌లోకి రెండు రోజులుగా నీరు విడుదలవుతుందని, మరో రెండు రోజుల్లో రిజర్వాయర్ పూర్తి స్థాయిలో నిండనుందని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. భూములను అప్పగించిన రైతులకు పరిహారం చెల్లింపులలో జాప్యం చేయొద్దన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె, శ్రీనివాస్, ఉదయ సముద్రం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి, శ్రీనివాస్‌రెడ్డి,డిఈ వీఠలేశ్వర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, దామెర ఉదయ్‌కుమార్, బొడిగె స్వామి ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి వెంకట్‌రెడ్డి

30 వరకు రేషన్ బియ్యం పంపిణీ చేయాలి

నల్లగొండ: ఈ నెల 30వ తేదీ వరకు రేషన్ కార్డు దారులకు రేషన్ షాపుల డీలర్లు తప్పనిసరిగా సన్న బియ్యం పంపిణీ చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ కార్డుదారులు ఈ విషయం గమనించి మూడు నెలల (జూన్, జూలై, ఆగస్టు)కు సంబంధించి బియాన్ని ఈనెలలోనే ఒకేసారి తీసుకోవచ్చని పేర్కొన్నారు.

భూభారతి అర్జీలను వెంటనే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ: భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. గురువారం నల్లగొండ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న భూభారతి దరఖాస్తులపై సమీక్షిస్తామన్నారు. రెవెన్యూ సదస్సుల్లో 45,313 దరఖాస్తులు వచ్చాయని వీటిని ఆగస్టు 14లోపు పరిష్కరిస్తామన్నారు. దరఖాస్తుల డేటా ఎంట్రీ పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తుదారుకు నోటీసు జారీచేసి విచారణ చేసిన తర్వాత వారం సమయం ఇచ్చి ఆ తర్వాత పరిష్కరించాలన్నారు. అదనపు ఇన్‌చార్జి కలెక్టర్ నారాయణ అమిత్ మాట్లాడుతూ వచ్చిన దరఖాస్తుల్లో 15వేలు మిస్సింగ్ సర్వే నంబర్లవే ఉన్నాయన్నారు. ఆర్డీఓలు అర్హత ఉన్న దరఖాస్తుల వివరాలు మాత్రమే భూభారతిలో నమోదు చేయాలన్నారు. సమావేశంలో దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ, ఎమ్మార్వోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

విద్యార్థులు 'ఇన్‌స్పైర్' పొందేలా..

- ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు మొదలైన దరఖాస్తులు
- చిన్నారులను భావి శాస్త్రవేత్తలుగా తయారు చేసేందుకు కార్యక్రమం
- 6 నుంచి 12 తరగతుల విద్యార్థులకు అవకాశం
- సెప్టెంబర్ 15 వరకు గడువు



నల్లగొండ: పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులను శాస్త్ర, సాంకేతిక ఆలోచనలు, సృజనాత్మకత వైపు మళ్లించి భావి శాస్త్రవేత్తలను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 'ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్డ్ రీసెర్చ్' (ఇన్‌స్పైర్) మనక్ అవార్డు(2025–26)కు సంబంధించి.. పాఠశాలల్లోని విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో నామినేషన్లు ఆహ్వానిస్తోంది. ఈ నెల 15న ప్రారంభమైన దరఖాస్తుల ప్రక్రియ సెప్టెంబర్ 15 వరకు కొనసాగనుంది. జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు, కేజీబీవీ, రెసిడెన్షియల్, ఎయిడెడ్ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పించింది.

గతంలో ఎంపికైనవి

సంవత్సరం	ప్రాజెక్టులు
2022-23	143
2023-24	139
2024-25	131

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేదిలా..

ఇన్‌స్పైర్ మనక్‌పై ఆసక్తి కలిగిన పాఠశాల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విద్యా శాఖ కోరుతోంది. www.inspireawards.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి రిజిస్ట్రేషన్ ఆప్షన్ ఎంచుకోవాలి. పాఠశాలలకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకుని సేవ్ చేసుకోవాలి. ఈ దరఖాస్తు జిల్లా అథారిటీకి వెళుతుంది. జిల్లా అథారిటీ ఆమోదిస్తే 24 గంటల్లోపు విద్యార్థికి సంబంధించిన మెయిల్ ఐడీకి యూజర్ ఐడీతో కూడిన లింక్ వస్తుంది. అప్పుడు యూజర్ ఐడీకి పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకోవాలి. విద్యార్థి తన సమాచారం, బ్యాంకు అకౌంట్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్, ఆధార్, విద్యార్థి ప్రదర్శించాలనుకున్న ప్రాజెక్టు సంక్షిప్త రిపోర్టు వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. విద్యార్థులు ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు సెప్టెంబర్ 15 వరకు అవకాశం ఉంది. అయితే విద్యార్థులు తాము చదువుతున్న పాఠశాలల్లో సైన్స్ ఉపాధ్యాయులతో కలిసి ఆన్‌లైన్‌లో ప్రాజెక్టు వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

ఐడియా బాక్సు ఏర్పాటు చేసుకోవాలి

అన్ని పాఠశాలల్లోని విద్యార్థులు వినూత్న ఆలోచనలను ఉపాధ్యాయులు గుర్తించేందుకు ఐడియా బాక్సు ఏర్పాటు చేసుకోవాలి. పరిసరాల్లో ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు ఈ వేదిక ద్వారా పరిష్కారం లభించే అవకాశం ఉంది. ప్రతి పాఠశాల నుంచి కచ్చితంగా 5 ప్రాజెక్టులు నామినేషన్ చేసుకోవాలి.

– వనం లక్ష్మీపతి, జిల్లా సైన్స్ అధికారి

ఇన్‌స్పైర్ మనక్ ఒక వరం

ఇన్‌స్పైర్ మనక్ విద్యార్థులకు ఒక వరం లాంటిది. శాస్త్రవేత్తలుగా ఎదగాలని కోరుకునే విద్యార్థులకు ఎంతగానో దోహదం పడుతుంది. సామాజిక సమస్యలకు శాస్త్రీయ రూపంలో పరిష్కారాలు చూపగలిగే సృజనాత్మక ప్రాజెక్టులను నమోదు చేయాలి. అందుకు సైన్స్ ఉపాధ్యాయులు సహకరించాలి.

– భిక్షపతి, జిల్లా విద్యాశాఖ అధికారి

జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పోటీలు

విద్యార్థులకు తమకు వచ్చిన ఆలోచనలతో తయారు చేసిన ప్రాజెక్టులు ప్రదర్శించేందుకు ఎంపికైతే వారి అకౌంట్లలో రూ.10 వేలు జమచేస్తారు. అయితే వాటిని జిల్లా స్థాయి పోటీల్లో ప్రదర్శిస్తారు. జిల్లా స్థాయిలో ఎంపికైతే రాష్ట్ర స్థాయిలో ప్రదర్శిస్తారు. రాష్ట్ర స్థాయిలో ప్రదర్శించిన ఆరు ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి జాతీయ స్థాయి పంపుతారు. జాతీయ స్థాయి ప్రాజెక్టులను ఢిల్లీలో ప్రదర్శించడంతోపాటు రాష్ట్రపతి భవన్‌లో కూడా ప్రత్యేక ప్రదర్శిస్తారు. అనంతరం సకురా ప్రోగ్రామ్ ద్వారా జపాన్ దేశంలోని పరిశోధన కేంద్రాలను సందర్శించేందుకు ఎంపికైన విద్యార్థులను పంపుతారు.

తనిఖీలతో బోధనకు ఆటంకం

- స్కూళ్ల పర్యవేక్షణకు టీచర్లకు బాధ్యతలు
- విద్యా శాఖ ఉత్తర్వులు జారీ
- ప్రభుత్వ బడుల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలని సర్కారు యోచన
- వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు



జీహెచ్‌ఎంలు	178	ఎల్‌ఎఫ్‌ఎల్	164
ఎస్‌ఏలు	2,278	ఎల్‌పీలు	97
ఎస్‌జీటీలు	2,729	పీఈటీలు	151
ఇతరులు	15	మొత్తం	5,612

నల్లగొండ: ఒకపక్క గురుకుల పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీల ఏర్పాటు అవడం..మరోపక్క పట్టణాల్లోని ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు ప్రతి గ్రామానికి బస్‌లు పంపుతూ ఇంగ్లిష్ మీడియం విద్యను అందిస్తుండడంతో అధిక శాతం తల్లిదండ్రులు తమ పిల్లలను ఆయా పాఠశాలల్లోనే చేర్పిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఏటేటా అడ్మిషన్ల సంఖ్య తగ్గుతూ వస్తోంది. ఈ పరిస్థితిని అధిమించేందుకు రాష్ట్ర విద్యా శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ పాఠశాలలను రోజూ తనిఖీ చేయడం ద్వారా విద్యా ప్రమాణాలు పెరుగుతాయని భావించింది. అందుకు తనిఖీల బాధ్యతను ఉపాధ్యాయులకు అప్పగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటయ్యే ఈ కమిటీతో తనిఖీ బాధ్యతలకు ఉపాధ్యాయులను ఎంపిక చేస్తారు. అయితే విద్యా శాఖ నిర్ణయాన్ని ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఉపాధ్యాయులు తనిఖీలు చేసేందుకు వెళ్తే బోధన కుంటుపడుతుందని అంటున్నారు.

బాధ్యతలు వీరికే..

పాఠశాలల తనిఖీలకు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల్లో పదేళ్ల అనుభవం ఉన్న ఉపాధ్యాయులు, ఎస్‌జీటీలు, స్కూల్ అసిస్టెంట్‌లను నియమించుకోవాల్సి ఉంటుంది. వీరిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉపాధ్యాయులు రోజుకు రెండు పాఠశాలలు తనిఖీ చేయాల్సి ఉంటుంది. అలాగే ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు రోజుకు ఒకటి చొప్పున మూడు నెలల్లో 50 ఉన్నత పాఠశాలలను తనిఖీ చేయించాలనేది విద్యా శాఖ నిర్ణయం. అయితే అర్హతల ఆధారంగా దరఖాస్తు చేసుకుంటే కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ ఎంపిక చేయనుంది. ఇదిలా ఉంటే ఓ ఎస్‌జీటీ మరో ఎస్‌జీటీ మీద, ఒక స్కూల్ అసిస్టెంట్.. మరో స్కూల్ అసిస్టెంట్ మీద తనిఖీలు చేయడం సరైంది కాదని ఉపాధ్యాయులు గొనుక్కుంటున్నారు.

ఎంఈఓలతో పర్యవేక్షణ చేయించాలి



ఉపాధ్యాయుల చేత ఉపాధ్యాయులపైనే పర్యవేక్షణ అనేది సరైంది కాదు. హైస్కూల్స్‌లో డిప్యూటీ డీఈఓలు ఉన్నారు. వారి సాయంతో తనిఖీలు నిర్వహించాలి. లేదా ఎంఈఓతో పర్యవేక్షించాలి. కాంప్లెక్స్ హెడ్మాస్టర్లకు పూర్తి స్థాయి అధికారాలు ఇస్తే సరిపోతుంది.

పెరుమాళ్ల వెంకటేశం, టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

బడులను సంక్షోభంలోకి నెట్టడమే..



ప్రభుత్వ నిర్ణయం బడులను సంక్షోభంలోకి నెట్టడమే. పాఠాలు చెప్పాల్సిన టీచర్లను పర్యవేక్షణకు పంపడం సరికాదు. ఎస్‌జీటీ మీద మరో ఎస్‌జీటీ పర్యవేక్షించడమనేది ఉపాధ్యాయులను అవమానించడమే. ప్రభుత్వం ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలి.

–వెంకులు, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్తాం



విద్యా శాఖ నిర్ణయాన్ని ప్రకటించినప్పటికి పూర్తి స్థాయి విధివిధానాలు వెలువడలేదు. ఈ విధానం సరైంది కాదు. ఈ విషయాన్ని మా సంఘం రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకుపోతాం. ప్రభుత్వం పూర్తి విధివిధానాలు ప్రకటించిన తర్వాతే స్పందిస్తాం.

– ఫణికుమార్, టీఎస్‌పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

శుభాన్షు శుక్లాకు సెల్యూట్



జాతీయ పతాకంతో సెల్యూట్ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

చిట్యాల: అంతరిక్షంలోకి అడుగుపెట్టిన రెండవ భారతీయుడుగా రికార్డు సృష్టించిన శుభాన్షు శుక్లాకు గురువారం చిట్యాలలోని ఆక్స్‌ఫోర్ట్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు భారీ జాతీయ పతాకం చేతపూని సెల్యూట్ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పెద్ది నరేందర్ మాట్లాడుతూ భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన శుభాన్షు శుక్లా నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు నర్రా భిక్షంరెడ్డి, నమ్ముల ఆనంద్‌కుమార్, షేక్ షెమీమున్నిసా బేగం, పుల్లెంల సంతు, గణేష్, జ్యోతి, ధనలక్ష్మి, ఆసియా, మాధవి, మౌనిక, కీర్తి, లింగస్వామి పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం

అడ్డగూడూరు: కుటుంబ కలహాలతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన అడ్డగూడూరు మండలం ధర్మారంలో గురువారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగూడూరు మండలం కోటమర్తికి చెందిన బురుగుల సోమయ్య(42), యాదమ్మ దంపతులకు ఒక కుమార్తె, కుమారుడు సంతానం. సోమయ్య మద్యానికి బానిసై భార్యతో తరచూ గొడవ పడుతుండేవాడు. దీంతో యాదమ్మ తన ఇద్దరు పిల్లలతో కలిసి ధర్మారం గ్రామానికి వచ్చి తన తల్లిగారి ఇంటి వద్ద ఉంటుంది. నెల క్రితం కుమారుడి నిశ్చితార్థం ఉండడంతో సోమయ్య ధర్మారంలో ఉంటున్న భార్య, పిల్లల వద్దకు వచ్చాడు. 15రోజులు అక్కడే ఉన్నాడు. ఆ తర్వాత భార్యతో గొడవపడి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ధర్మారం గ్రామంలో తల్లిగారి ఇంటి వద్ద ఉంటున్న యాదమ్మ బుధవారం రాత్రి భోజనం చేసి నిద్రించింది. గురువారం తెల్లవారుజామున ఆమె నిద్ర లేచి చూసేసరికి ఇంట్లో ఉన్న జామచెట్టుకు సోమయ్య చీరతో ఉరేసుకుని కనిపించాడు. ఇరుగు పొరుగు వారు వచ్చి చూసేసరికి సోమయ్య మృతిచెందాడు. కుటుంబ కలహాలతోనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని భార్య యాదమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికిచెందిన ఎస్‌ఐ, కానిస్టేబుల్ దుర్మరణం
- మరో హెడ్ కానిస్టేబుల్, డ్రైవర్‌కు తీవ్ర గాయాలు
- కేసు విచారణ నిమిత్తం కోనసీమ జిల్లా అలమూరు స్టేషన్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా ప్రమాదం
- సూర్యాపేట జిల్లా కోదాడ సమీపంలోని దుర్గాపురం క్రాస్‌రోడ్ వద్ద ఘటన



కారులో ఇరుక్కున్న మృతదేహాలను బటయకు తీస్తున్న కోదాడ పోలీసులు



మృతదేహాలకు నివాళులర్పిస్తున్న కోనసీమ జిల్లా అడిషనల్ ఎస్పీ, కోదాడ డీఎస్పీ



ముద్దాల అశోక్, ఎస్‌ఐ (ఫైల్)



బ్లెస్సీన్ జీవన్, కానిస్టేబుల్ (ఫైల్)

కోదాడరూరల్: కోదాడ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏపీకి చెందిన ఎస్‌ఐ, కానిస్టేబుల్ దుర్మరణం చెందారు. మరో హెడ్‌కానిస్టేబుల్, కారు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటన హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై కోదాడ పట్టణ పరిధిలోని దుర్గాపురం జంక్షన్ సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగింది. వివరాలు.. ఏపీలోని కోనసీమ జిల్లా అలమూరు పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ ముద్దాల అశోక్(43), అదే స్టేషన్‌లో ఐడీ పార్టీ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యస్వామితో పాటు ఆత్రేయపురం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సుంకర బ్లెసీన్ జీవన్(31) కలిసి గంజాయి కేసులో నిందితులను పట్టుకునేందుకు ఎర్టిగా కారులో డ్రైవర్ రమేష్‌తో కలిసి బుధవారం రాత్రి 10గంటల సమయంలో హైదరాబాద్‌కు బయల్దేరారు. మార్గమధ్యలో డ్రైవర్‌కు నిద్రవస్తుందని చెప్పడంతో అంతర్రాష్ట్ర సరిహద్దు వద్ద ఏపీ వైపు గంటన్నరపాటు కారు పక్కకు ఆపి నిద్రించారు.

బయల్దేరిన 10 నిమిషాలకే..

కొద్దిసేపటి తర్వాత వీరు తిరిగి హైదరాబాద్‌కు బయల్దేరగా.. ఆ తర్వాత పది నిమిషాలకే కోదాడ పట్టణ పరిధిలోని దుర్గాపురం జంక్షన్‌లో రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారుతో ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఎస్‌ఐ అశోక్, కానిస్టేబుల్ బ్లెస్సీన్ జీవన్ అక్కడికక్కడే మృతిచెందారు. హెడ్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యస్వామి, డ్రైవర్ రమేష్‌కు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న కోదాడ పట్టణ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం స్థానికంగా ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

కారులో ఇరుక్కుపోయిన ఎస్‌ఐ మృతదేహం

లారీని కారు వెనుక నుంచి ఢీకొట్టడంతో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. కారు ముందు భాగంలో కూర్చున్న ఎస్‌ఐ మృతదేహం అందులో ఇరుక్కుపోయింది. కోదాడ పోలీసులు కారు భాగాలను తొలగించి అతికష్టం మీద ఎస్‌ఐ మృతదేహాన్ని బయటకు తీశారు. ఎస్‌ఐ అశోక్‌ది ఏపీలోని నరసాపురం అని, 2009 బ్యాచ్‌లో ఎస్‌ఐగా ఎంపికయ్యాడని, త్వరలోనే సీఐ ప్రమోషన్ రానుందని ఘటనా స్థలానికి వచ్చిన ఆయన స్నేహితులు తెలిపారు. అశోక్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కానిస్టేబుల్ బ్లెసీన్ జీవన్ అవివాహితుడు. ఈ ఘటన తర్వాత లారీతో సహా డ్రైవర్ పరారయ్యాడు. అయితే పోలీసులు లారీని పట్టుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

నివాళులర్పించిన కోనసీమ అడిషనల్ ఎస్పీ, కోదాడ డీఎస్పీ

కోదాడ ప్రభుత్వ వైద్యశాలలో ఎస్‌ఐ, కానిస్టేబుల్ మృతదేహాలకు కోనసీమ జిల్లా అడిషనల్ ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి నివాళులర్పించారు. అనంతరం మృతదేహాలను ఏపీ పోలీసులకు అప్పగించారు. క్షతగాత్రుడు హెడ్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కోదాడ పట్టణ సీఐ శివశంకర్ తెలిపారు.

నిరంతర సాధనతోనే విజయాలు సాధ్యం

- నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టూటౌన్: నిరంతర సాధనతోనే విజయాలు సాధ్యమని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నల్లగొండలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీలో విద్యార్థులకు ఉచిత పోటీ పరీక్షల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్‌తో కలిసి ఆమె ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు అవాంతరాలను అధిగమిస్తూ విజయపథంలో ముందుకుసాగాలని సూచించారు. మానవీయ సమాజ నిర్మాణమే లక్ష్యంగా విద్యార్థులు నడుచుకోవాలన్నారు. ఈ సందర్భంగా యూపీఎస్సీ సాధనలో తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. అనంతరం ఉచిత పోటీ పరీక్షల శిక్షణకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ.. నైపుణ్యాభివృద్ధి, మెంటారింగ్ ద్వారా సివిల్స్‌పై అవగాహన పెంచేందుకు 12 అంశాల్లో విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నామన్నారు. ఈ శిక్షణ 3 సంవత్సరాల పాటు కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు, అధ్యాపకులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ ప్రదీప్, భవానీ శంకర్, రిజిస్ట్రార్ అల్వాల రవి, సురేష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సీహెచ్. సుధారాణి, కె. అరుణప్రియ, ప్రేమ్‌సాగర్, డాక్టర్ మద్దిలేటి, లక్ష్మీప్రభ, అనితా కుమారి, ఇందిర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఎంజీయూలో పరికరాల ప్రదర్శన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంజీయూ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ తదితరులు

నల్లగొండ టూటౌన్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఆవిష్కరించిన పరికరాలను శుక్రవారం యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో ప్రదర్శించనున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్. సుధారాణి గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ అల్వాల రవి హాజరుకానున్నట్లు ఆమె పేర్కొన్నారు. గురువారం వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆకుల రవి, రేఖ, జయంతి పాల్గొన్నారు.

రైతులను మోసం చేసి సంబురాలా..?

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



నీర్నెముల గ్రామంలో మహిళలతో మాట్లాడుతున్న చిరుమర్తి లింగయ్య

రామన్నపేట: రైతు రుణమాఫీ పూర్తిగా చేయకుండా రైతులను మోసం చేసిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సంబురాలు చేసుకోవడమేమిటని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రశ్నించారు. గురువారం రామన్నపేట మండలం లక్ష్మాపురం గ్రామంలో ఓ కార్యక్రమంలో పాల్గొని తిరిగి వస్తున్న ఆయన నీర్నెముల గ్రామంలో మహిళలతో ముచ్చటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ పదకొండు పర్యాయాలు రూ.75వేల కోట్లు రైతుబంధు పేరుతో రైతులకు పెట్టుబడి సహాయం అందిస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొదటి పంటకు ఎకరాకు రూ.5వేలు మాత్రమే ఇచ్చాడని, రెండో పంటకు పూర్తిగా ఎగ్గొట్టి, మూడో పంటకు నాలుగెకరాల వరకు కూడా రైతు భరోసా ఇవ్వలేదని విమర్శించారు. రూ.2లక్షల లోపు పంట రుణం ఉన్న రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ జరుగలేదని అన్నారు. ఆత్మీయ భరోసాకు కొర్రీలు పెట్టారని, సబ్సిడీ గ్యాస్ ఇవ్వడం లేదని, తులం బంగారం ఊసేలేదని, మహిళలకు రూ.2500 ఆర్థికసాయం అందించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. అంతకుముందు ఆయన లక్ష్మాపురంలో ఇటీవల మృతిచెందిన నీల స్వామి చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట నాయకులు పోచబోయిన మల్లేశం, బత్తుల శంకరయ్య, కమ్మంపాటి శ్రీనివాస్, సాల్వేరు అశోక్, ఎస్‌కే చాంద్, ఎండీ ఆమేర్, బత్తుల వెంకటేశం, పులిపలుపుల వీరస్వామి, కొయ్యగూరి వెంకన్న, జాడ సంతోష్, బత్తిని మహేష్, ముక్కాముల సత్తయ్య, కుమార్ తదితరులు ఉన్నారు

టెక్స్‌టైల్ పార్కులో చోరీ

- గార్మెంటరీ షెడ్‌లో 35 కుట్టుమిషన్లు ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు



కుట్టుమిషన్లు ఎత్తుకెళ్లిన దుండగులు

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ పరిధిలోని టెక్స్‌టైల్ పార్కులోని ఓ గార్మెంటరీ షెడ్‌లో గురువారం కుట్టు మిషన్లు చోరీకి గురయ్యాయి. వివరాలు.. చోడవరపు చిట్టిబాబు కరోనా వరకు టెక్స్‌టైల్ పార్కులో గార్మెంటరీ షెడ్ నిర్వహించాడు. కరోనా కాలంలో షెడ్‌ను మూసివేశాడు. ఇటీవల తిరిగి గార్మెంటరీ షెడ్‌ను తెరిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ క్రమంలో వారానికి ఒకసారి వచ్చి షెడ్‌ను చూసుకుని వెళ్తుంటాడు. వారం క్రితం గార్మెంటరీ షెడ్‌లోని ఉన్న బట్టలను తీసుకుని వెళ్లాడు. గురువారం ఉదయం వచ్చి చూడగా అందులో ఉన్న 35 కుట్టు మిషన్లు కనిపించలేదు. వెంటనే 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని పరిశీలించారు. ఒక్కో కుట్టు మిషన్ విలువ రూ.35వేలు ఉంటుందని నిర్వాహకుడు చిట్టిబాబు తెలిపారు. ఈ మేరకు చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు. నాలుగు నెలల క్రితం టెక్స్‌టైల్ పార్కులోనే వేరొక గార్మెంటరీ షెడ్ వద్ద ఇనుప స్తంభాలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి

పెద్దఅడిశర్లపల్లి: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కోదాడ-జడ్చర్ల హైవేపై పెద్దఅడిశర్లపల్లి మండల పరిధిలోని ఘనపురం గ్రామ స్టేజీ సమీపంలో గురువారం రాత్రి జరిగింది. గుడిపల్లి ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅడిశర్లపల్లి మండలం అక్కంపల్లి గ్రామానికి చెందిన జ్యోతయ్య(62) గురువారం రాత్రి ఘణపురం గ్రామానికి నడుచుకుంటూ వెళ్తుండగా.. గుర్తుతెలియని వాహనం అతడిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- అతడి కుమార్తెకు గాయాలు



సత్తయ్య (ఫైల్)

కనగల్: బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతిచెందగా.. అతడి కుమార్తెకు గాయాలయ్యాయి. ఈ ఘటన కనగల్ మండలం బోయినపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కుమ్మరిగూడెం గ్రామ స్టేజీ వద్ద బుధవారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ పి. విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. కనగల్ మండలం బచ్చన్నగూడెం గ్రామానికి చెందిన పల్లె బోయిన సత్తయ్య(43) రెండో కుమార్తె కావ్య బుధవారం సూర్యాపేటలో పరీక్ష రాసి రాత్రి 7గంటల సమయంలో కనగల్ బస్టాండ్‌కు వచ్చింది. ఆమెను ఆమెను సత్తయ్య బైక్‌పై ఎక్కించుకొని స్వగ్రామానికి వెళ్తుండగా.. కుమ్మరిగూడెం గ్రామ స్టేజీ వద్ద చండూరు మండలం తాస్కానిగూడెం గ్రామానికి చెందిన వంగూరి బిక్షం వేగంగా ట్రాక్టర్ నడుపుకుంటూ వచ్చి బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సత్తయ్య బైక్ పైనుంచి కిందపడగా అతడిపై మీద నుంచి ట్రాక్టర్ వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బైక్ వెనుక కూర్చున్న కావ్యకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులిద్దరిని 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే సత్తయ్య మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గురువారం పోస్టుమార్టం అనంతరం సత్తయ్య మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య అలివేలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

లంచం డిమాండ్.. పంచాయతీ కార్యదర్శి అరెస్ట్



పంచాయతీ కార్యదర్శి సతీష్‌కుమార్

పెన్‌పహాడ్: బొగ్గు బట్టీ నిర్వహణకు అనుమతి ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేసిన పంచాయతీ కార్యదర్శిని ఏసీబీ అధికారులు గురువారం అరెస్ట్ చేశారు. నల్లగొండ రేంజ్ ఏసీబీ డీఎస్పీ జగదీష్ చందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెన్‌పహాడ్ మండలం నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన వ్యక్తి బొగ్గు బట్టీ నిర్వహణకు అనుమతి ఇవ్వాలని ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి అనంతుల సతీష్‌కుమార్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో పంచాయతీ కార్యదర్శి రూ. 15వేలు లంచం డిమాండ్ చేశాడు. అంత డబ్బు ఇవ్వలేనని, బతుకుదెరువు కోసం బొగ్గు బట్టీ పెట్టుకుంటున్నానని చెప్పినప్పటికీ కార్యదర్శి అనుమతి ఇవ్వలేదు. ఈ క్రమంలో బాధితుడు రూ.8వేలు ఇస్తానని చెప్పి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. తన దగ్గర ఉన్న ఆధారాలను బాధితుడు ఏసీబీ అధికారులకు ఇవ్వడంతో అధికారులు విచారణ జరిపి పంచాయతీ కార్యదర్శి లంచం అడిగినట్లు రుజువు కావడంతో గురువారం అరెస్ట్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఏసీబీ డీఎస్పీ జగదీష్ చందర్ తెలిపారు.

లోకాయుక్త ఆధ్వర్యంలో స్టోన్ క్రషర్ మిల్లుల పరిశీలన



స్టోన్ క్రషర్ మిల్లును పరిశీలిస్తున్న అధికారులు

బొమ్మలరామారం: మండలంలోని రామలింగంపల్లి, పెద్దపర్వతాపూర్, బొమ్మలరామారం గ్రామాల్లోని పలు స్టోన్ క్రషర్ మిల్లులను లోకాయుక్త అధికారులతో పాటు పలు శాఖల అధికారుల బృందం గురువారం పరిశీలించారు. మండలంలోని సామాజిక కార్యకర్త మైలారం జంగయ్య ఫిర్యాదు మేరకు అధికారుల బృందం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్టోన్ క్రషర్ మిల్లుల నిర్వహణకు అవసరమైన ప్రభుత్వ అనుమతులపై ఆరా తీశారు. నిబంధనల మేరకే మైనింగ్ తవ్వకాలు జరుగుతున్నాయా, ఎక్స్‌ప్లోజివ్ వినియోగం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ నిబంధనలు పాటిస్తున్నారా, సక్రమంగా రాయల్టీ చెల్లిస్తున్నారా లాంటి అంశాలను పరిశీలించారు. క్రషర్ మిల్లుల యాజమానులు వారి వద్ద ఉన్న అనుమతి పత్రాలను వారంలోగా తమకు సమర్పించాలన్నారు. ఏ క్రషర్ మిల్లు యజమాని ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని, వారి ఇష్టానుసారంగా క్రషర్ మిల్లులు నడిపిస్తున్నట్లు తమ పరిశీలనలో తేలిందని లోకాయుక్త అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లోకాయుక్త సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వెంకట్‌రావ్, డీఎస్పీ విద్యాసాగర్‌రావు, భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ వెంకన్న, జిల్లా మైనింగ్ అధికారి రాఘవరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసరావు, జిల్లా మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్, మైనింగ్ డిజిటల్ సర్వేయర్ సుజాత, భువనగిరి రూరల్ సీఐ చంద్రభాను, ఎస్‌ఐ బుగ్గ శ్రీశైలం, ఎంఆర్‌ఐ వెంకట్‌రెడ్డి, సర్వేయర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచర్లు, గంజాయి విక్రయదారుల అరెస్ట్

- వివరాలు వెల్లడించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ: చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న భార్యాభర్తలతో పాటు గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. గురువారం నల్లగొండ పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నల్లగొండ మండలం అప్పాజిపేటకు చెందిన మేడిపల్లి పార్వతమ్మ ఈ నెల 19న గ్రామ శివారులో చింతచిగురు తెంపుతుండగా.. నల్లగొండకు చెందిన బాపట్ల వెంకటేశ్వర్లు, అంజమ్మ దంపతులు ఆమెను గమనించారు. అంజమ్మ రోడ్డు వెంట వచ్చే వారిని గమనిస్తుండగా.. వెంకటేశ్వర్లు పార్వతమ్మ వద్దకు వెళ్లి మాటలు కలిపి ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కొని భార్యాభర్తలు ఇద్దరు పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నల్లగొండ రూరల్ ఎస్‌ఐ సైదాబాబు కేసు నమోదు చేసి.. సీసీ కెమెరాల సహాయంతో నిందితులను గుర్తించారు. దొంగిలించిన బంగారు గొలుసును నిందితులు ముద్ద చేసి ఇంట్లో దాచి ఉంచగా.. దానిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను పట్టుకున్న రూరల్ ఎస్‌ఐ సైదాబాబు, కానిస్టేబుళ్లను డీఎస్పీ అభినందించారు.

గంజాయి విక్రయిస్తుండగా..

శాలిగౌరారం మండలంలోని వ్యవసాయ మార్కెట్ వద్ద కొంత మంది గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో బుధవారం స్థానిక ఎస్‌ఐ సైదులు ఆధ్వర్యంలో దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. శాలిగౌరారం మండలం బాలిశెట్టిగూడేనికి చెందిన మిడతపల్లి రాజేష్ కల్లు గీసేందుకు గతంలో ఒరిస్సాకు వెళ్లగా.. అక్కడ గంజాయి తాగేవారితో పరిచయం ఏర్పడి అతడు కూడా గంజాయి అలవాటుపడ్డాడు. ఆరోగ్యం సహకరించకపోవడంతో రాజేష్ కల్లుగీత వృత్తిని బంద్ చేసి హైదరాబాద్‌లో స్విగ్గీ ఇన్‌స్టా కంపెనీలో పనిచేస్తున్నాడు. వచ్చే జీతం సరిపోక సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో గత సంవత్సరం నుంచి గంజాయి విక్రయిస్తున్నాడు. తన స్నేహితులు గడిపర్తి ఆకాష్, మధురాజ్, బాదిని ప్రశాంత్‌తో కలిసి ఒరిస్సాలోని బరంపురలో 6కిలోల గంజాయి కొని ఇక్కడకు తెచ్చి భాగాలు పంచుకుంటుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ప్రశాంత్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ రెండు కేసుల్లో నిందితుల నుంచి 3 సెల్‌ఫోన్లు, 2 బైక్‌లు, 2 తులాల బంగారం, 4.460 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో నకిరేకల్ సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ సైదులు పాల్గొన్నారు.

రుణాలపై అవగాహన పెంచాలి

- నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ్ భాస్కర్



సదస్సును ప్రారంభిస్తున్న సీజీఎం ఉదయ్‌భాస్కర్

ఖమ్మం వ్యవసాయం: వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలపై రైతులతో పాటు అన్నివర్గాల వారికి అవగాహన పెంపొందించాలని నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) ఉదయ్‌భాస్కర్ సూచించారు. ఖమ్మంలో గురువారం వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలపై ప్రాంతీయ(ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి నల్లగొండ జిల్లాల) స్థాయి బ్యాంకర్ల అవగాహన సదస్సు నాబార్డ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సదస్సులో సీజీఎం మాట్లాడుతూ.. రుణాలు అందుబాటులో ఉన్న విషయమై రైతులు, ప్రజలకు అవగాహన కల్పిస్తే సద్వినియోగం చేసుకుంటారని తెలిపారు. వివిధ రంగాల వారికి ప్రయోజనం కలిగేలా ప్రభుత్వాలు పథకాలను రూపొందించి సబ్సిడీ కల్పిస్తున్నాయని, కూరగాయల సాగు, సూక్ష్మసేద్య పరికరాలు, డ్రోన్లు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటుకు రుణాలు అందుబాటలో ఉన్నాయని చెప్పారు. ఈ విషయమై బ్యాంకర్లు విస్తత అవగాహన కల్పించాలని సీజీఎం తెలిపారు. ఈ సమావేశంలో నాబార్డ్ జనరల్ మేనేజర్ గణపతి, డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీకాంత్, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ రాజశేఖర్, నల్లగొండ డీసీసీబీ సీఈఓ శంకర్‌రావు, అధికారులు ఆర్య రవీంద్రన్, వినయ్‌కుమార్, సుజిత్ కుమార్, రవీందర్‌నాయక్, పాండురంగ తదితరులు పాల్గొన్నారు.

బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకుంటాం

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ : 'ఎట్టి పరిస్థితుల్లోనూ బనకచర్ల ప్రాజెక్టును ఒప్పుకోం.. దాన్ని అడ్డుకుని తీరుతాం' అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన మాదకద్రవ్యాల వ్యతిరేక ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం జరిగితే భారతీయ జనతా పార్టీని తెలంగాణ ప్రజలు క్షమించరని అన్నారు. చంద్రబాబునాయుడుకు.. బీజేపీతో పొత్తు ఉన్నంత మాత్రాన బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం జరగదన్నారు. బనకచర్లపై కేబినెట్ సమావేశంలో చర్చించామన్నారు. ఆ మినిట్స్‌ను కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. ఈ నెల 30వ తేదీన ప్రజా భవన్‌లో ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బనకచర్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఉంటుందన్నారు. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు కేంద్రం అనుమతులు ఇవ్వకపోతే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. కరోనా తర్వాత చాలా మంది యువత డ్రగ్స్ వైపు మళ్లడంతో దాని వాడకం పెరిగిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. చాలా మంది విద్యార్థులు దానికి బానిసలుగా మారారన్నారు. డ్రగ్స్ రహిత తెలంగాణగా మార్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. విద్యార్థి దశలోనే విద్యార్థులకు లైఫ్ టర్నింగ్ టైమ్ అని, 20 ఏళ్ల వరకు చదువు, స్పోర్ట్స్, యోగాపై దృష్టి సారించాలన్నారు.